స్కెచ్

# అకారణ బంధువు

వై. యం. శర్మ

పిల్లిమీద ఎలకనూ, ఎలకమీద పిల్లినీ ఎక్కించే స్వభావం చెల్లయాచారిది. ఊళ్ళో ఏ అల్లరి జరిగినా, ఏ వ్యవహారం నడిచినా అక్కడ చెల్లయాచారి ప్రత్యక్షం! మొన్న ఈశ్వరాచారి మొదటి పెళ్లాం మనోవర్తి కని వచ్చినప్పుడు చూడరాదూ - అటు రెండు మాటలూ, ఇటు రెండు మాటలూ చెప్పి ఉభయులకూ హితుడైనాడు. ఏమి టట్లా అడుగుతారు, ఏమన్నా గిట్టిందా అంటే గిట్టనూ వచ్చు, తప్పేం? దేవుడి వ్యవహారంలో మాత్రం? అతను లేందీ నరసింహస్వామి స్తంభంలోంచి బయటికి రావడానికి జంకవలసిందే!

ఎందుకు చెప్పొస్తున్నానంటే-అతను నలుగురి విషయాల్లోనూ అలా కలిపించుకుని ఓ గట్టెక్కిస్తుండటంచేత పదిమందీ అతన్ని మంచివాడనే అంటున్నారు మరి, నడిరోడ్డుమీద! ఊరు మరమ్మతుకు అతడు ఏరోజు కంకణం కట్టుకున్నాడో తెలియదు, ఎప్పుడు విప్పేస్తాడో కూడా తెలియదు. ప్రస్తుతం మరమ్మతు చేస్తున్నాడు. మీకు నేను చెప్పవలసింది- సీలలు మాత్రం బహు దిట్టంగా కొడుతున్నాడు ఆ వూరి ప్రజల నెత్తిన.

'చూడండీ, వెంకట్రా వున్నాడే - వాడు ఉద్యోగంలో చేరి యింకా యేడాదన్నా కాలేదే, అప్పుడే యిల్లు కట్టించుకున్నాడంటే- ఏమాత్రమూ లంచాలు పట్టందీ ఎట్లా కట్ట గలడు చెప్పండి?'...' ఈ కాంగ్రెసు గవర్నమెంటుతో మరీ తెలివి మీరిపోయారే ప్రజలు - రైల్లో చూడండి, ఒకళ్లే నా టిక్కట్టుతో ప్రయాణం చేస్తున్నారేమో? ......' 'కిష్టారావు స్కూలు మాస్టరుగా చేరాడేగాని ఏం లాభం? సుష్ఠుగా పది గంటలకు హోటల్లో భోంచెయ్యటం, స్కూలుకు పోయి క్లాసులో హాయిగా నిద్రపోవటం' '... మీకు తెలియదు కాబోలు - బాపయ్య మూడో పెళ్లాం జీతగాడితో లేచిపోతే మళ్లీ తెచ్చి యింట్లో వుంచుకోటం-మొన్నవాళ్లు మళ్లీ కీచులాడుకుంటుంటే సర్ది చెప్పాను.' ఇవీ-చెల్లయాచారి నుంచి మనకు వినబడే కొన్ని సూక్తులు.

నాకు ఆఫీసులో పని వుండటం చేత రోజూ ఇంటికి కొంచెం పొద్దుపోయే వస్తుండే వాణ్ణి చెప్పొద్దూ! అవి రాణి కొత్తగా కాపరాని కొచ్చిన రోజులు. 'పెందరాళే ఇంటికి రాలేరుటండీ?' అని రాణి నన్ను మందలించింది కూడా. నేనే పట్టించుకోలేదు. ఐనా - పొద్దు కూకులా కుర్చీ కంటిపెట్టుకు కూచున్న వాణ్ణి ఎనిమిదైనతరువాతైనా కాస్త షికారుకు పోయి రాకపోతే ఎలా చెప్పండి?... ఔనా? సుబా నని మా ఆఫీసులో జవానొకడున్నాడు. వాడు కొంచెం గ్రంధసాంగుట్ట. ఆఫీసులో ఉద్యోగుల నందర్నీ తన యింటికి పిల్చి సభార్యాకంగా మర్యాద చేస్తూ వుంటాట్ట. గాయత్రి సాక్షిగా చెబుతున్నాను సుమండీ, నేను ఏపాపం ఎరగను- రాణి నాకీ సంగతి చెప్పిందాకా! ఎట్లా పుట్టిందో తెలియదు. రాణికి నామీద అనుమానం కలిగింది. చెల్లయాచారి యిల్లు మాయింటి పక్కనే అవడంచేత వాళ్ళమ్మ తాయారమ్మ అనేకమాట్లు మాయింటికి వస్తూ పోతూ వుండేది. ఆవిడే యిది రాణి చెవులో ఊది వుంటుం దని నాకు గట్టి నమ్మకం.

ఆఫీసు ఇన్స్పెక్షన్ రోజులు. రాత్రి పది గంటలైనా లెక్కలు తెమలటం లేదు. హెడ్ ఎకౌంటెంటు దగ్గరకూచుని లెక్కలు తణిఖీ చేస్తున్నాడు స్వయంగా, ఏరోజు కారోజు. మరేం చావనా? అర్రోజు కారోజు నేనింటికొచ్చే వేళా, రాణి అల్లరీ ఒక దానితో ఒకటి పోటీ వేసుకుని పెరిగి పోతున్నాయి.

'దానింటికి పోవద్దని ఎన్నిసార్లు చెప్పేదండీ? దాని అదృష్టమేమో - ఇన్నాళ్లూ నేను చేసిన తపస్సు మట్టిలో కలిసిపోయింది. నిన్న గాక మొన్న నొచ్చింది- ఏం మందు పెట్టిందో-యెగరేసుకుపోయింది నా రాజును.' కళ్ళ నీళ్లు పెట్టుకుంది రాణి.

'చూడు రాణీ, ఎందు కిట్లా యిదౌతావు చెప్పుడుమాటలు విని? నన్ను నమ్మవ్? ప్రమాణం చేస్తున్నాను!' ఓదారుస్తున్న కొద్దీ రాణి సంగీతం మందరంలోంచి ఏకంగా షడ్జమంలోకి రెచ్చిపోయింది.

'చాల్లెండి, మీరూ మీ ఓదార్పులూ. అనుభవుంతా దానిదీసీ మాటల మూటలు నాకూనూ. నాతో అవసరమేం వుంది? నే నిక్కడొక్క క్షణం ఉండను!' దురుసుగా లేచిపోయింది, బుజ్జగిస్తున్న నా కౌగిట్లోంచి రాణి.

'ఏమిటీ పిచ్చి, రాణీ? ఎవరో చెప్పిన మాట నమ్ముతావా?'

'చాల్లెండి, ఒకరు చెప్పే దేమిటి? లోకం కోడై కూస్తుంటే? తాయారమ్మ...' సగంలో నోరు నొక్కుకుంది.

'చెప్పిందీ ? చెల్లయాచారిని కన్న కడుపు- అంతకంటె మరేం చేస్తుంది? దానిమాటను వ్వెట్లా నమ్మావ్? రానీ, చెబుతా రేపు!' ఒళ్లు మండిపోయి మనసులో మాట అనేశాను.

'చాలూరుకోండి-ఆమె నంటే కళ్లు పోతాయ్. అంత జ్ఞాని ఈ చుట్టుపట్ల ఎక్కడా లేదు'

'ఔనాను.'

మర్నాడు ఉదయం ఎంతబతిమాలుతున్నా వినిపించుకోకుండా రాణి పుట్టింటికి లేచి చక్కాపోయింది. కాని ఎవర్నీ ఏమీ అనలేకపోయాను. లోపల్లోపలే కుమిలిపోయాను - చెల్లయాచారీ, అతని తల్లీ చేసిన ద్రోహానికి.

సరిగా నెల గడిచింది. ఈ నెలరోజులూ నా అవస్థ పెరుమాళ్ళ కెరుక. పొద్దున్నే పొయ్యి దగ్గిర చెయ్యి కాల్చుకోటం, పాలు రావటం ఆలస్యమై కాఫీ తాగకుండానే ఆఫీసుకు పరిగెత్తుకుపోటం, పాలు గూట్లో పెట్టి పోతే మళ్ళీ వచ్చేటప్పటికి వాటిని కాస్తా పిల్లి తాగిపోవటం, స్నానానికి నీళ్లు పెట్టుకుందామంటే కట్టెలు మండక పొగతో కళ్లు నీళ్ళు కారటం, పదకొండు గంటలకు పడుతూ లేస్తూ మాడిపోయిన మెతుకులు గొంతులో కొట్టుకుని పరిగెత్తుకు వెడితే ఐదునిమిషాలు ఆలస్యమైనందుకు నిర్దాక్షిణ్యంగా ఆఫీసరు అనరాని మాట లనటం, చచ్చి చెడి రాత్రి పదిగంటలకి కాళ్లీడ్చుకుంటూ ఇంటికి వచ్చి అప్పుడు పిండాకూడు తగలేసుకోబోతే ఎట్లా వుంటుంది చెప్పండి? తరవాత సంగతులు మీ రడగనూ వద్దు, నేను చెప్పనూ చెప్పను. రోజూలాగ ఓ అత్తర్లా? ఓ పూదొత్తులా? ఓ తమలపాకుల చిలకలా! ప్చ్, లాభంలేదు. చెప్పలేను. ఈ నెల రోజుల్లో నాలో నేను చెల్లయాచారిని తిట్టుకోని రోజే లేదు-మనలో మనమాట, ఎవరితోనూ అనకండి మళ్లీ, బాగుండదు-ఆరోజు లగాయితు నేను చెల్లయాచారితో మాట్లాడితే ఒట్టు.

ఆవేళ ఫస్టుతారీఖు అవటంచేత పర్సునిండుగా వుంది. నెలసరిపద్దులు తీర్చేసి మిగిలిన పైకం లెక్కపెట్టుకుంటున్నాను. ఉన్నట్టుండి గొల్లుమని ఏడుపులు వినబడ్డాయి. పాపం, ఎక్కడా ఈ యేడుపులూ, పెడబొబ్బలూ అని అట్లా చూస్తే చెల్లయాచారింట్లో! సంగతేమిటో తెలియలేదు. చెల్లయాచారి ఎన్నడూ జిర్రున చీదగా చూడలేదు ఇక అతని తల్లా, డెబ్భయిసంవత్సరాలుగా అట్లాగే వున్నది—మేకల్లే. ఆచారి భార్య అంటారా? పాపం, ఆమెకూ చెప్పుకోతగ్గ ఏ జబ్బూ ఇంతవరకూ చేసినట్టు వినలేదు. ఏమో, ఏ నిమిషానికేం జరుగుతుందో యెవరెరుగుదురు? శరీరం బుద్బుదప్రాయం! ఈ మాత్రపు బ్రతుకునే నమ్ముకుని కాదూ, చెల్లయాచారి అంత విర్రవీగటం! కష్టంలో వున్న ప్రతివాణ్ణీ వెక్కిరించటమే! తలనొప్పి తన దాకా వస్తేకాని తెలియదు.

దగ్గరే వున్న తలుపు భళ్లున తెరుచుకుంది లోపలికి. ఆశ్చర్యం! నా గుమ్మం ఎన్నడూ తొక్కి యెరగని వ్యక్తి నాముందు ప్రత్యక్షమైనాడు—చెల్లయాచారి. మొహం వేలబడిపోయింది, కళ్ళలో ఆతుర్దా తొణికిస లాడుతోంది.

'ఏం ఆచారీ, దిగులుగా ఉన్నట్టున్నావేం? ఏమిటి సంగతి?కూచో—'నాగది అలంకారానికి

నేనే ముసిసిపోతూ సోఫా చూపించాను- ఆచారి మరి కాస్త కుళ్లిపోవటాని కని. ఆచారి కంగారులో ఇవేవీ గమనిస్తున్నట్టే లేదు.

'సుబ్బారావ్, ఆపదలో వున్నాను. ఎన్నడూ రానివాణ్ణి నీ సహాయం కోసం వచ్చాను. చేస్తానంటే చెబుతాను.' గుండె కరిగిపోయేటట్టు అన్నాడా మాటలు.

'అయ్యో, పాపం! తప్పకుండా చేస్తాను- నా చేతనైతే.' మాట విడిచేశాను, నా మంచితనాన్ని చూసయినా అతను బుద్ధి మార్చుకుంటాడని.

'అంతమాత్రం మాటన్నావంటే చాలు- చంటివాడికి టైఫాయిడు సంధించింది. వెంటనే ఇంజెక్షన్ యిప్పించకపోతే ప్రాణం నిలిచే ఆశ లేదుట. అయిదు రూపాయలు నీకంత పెద్ద మొత్తం కాదని ఆశపడి వచ్చాను.'

'ఛాన్లే ఆచారీ, రూపాయలు కావలసినప్పుడు నేను మంచివాణ్ణిని, లేకపోతే చెడ్డవాణ్ణిని. అంతేలే; పెడితే పెళ్లి, పెట్టకపోతే శార్థమూనూ.' మొహం వాచేట్టు దులిపేశాను. పాపం, నీరైపోయాడు మానవుడు.

'గతం మరిచిపో బ్రదర్, చచ్చిన పామును చితగ్గొట్టటం నీకు భావ్యం కాదు.' అవే మాటలు మరెవళ్లయినా అంటే కరిగిపోయే వెన్నవంటి నా మనస్సు ఆ నిమిషాన వజ్రం కన్నా గట్టిదై పోయింది.

'నీ మేలు మరిచిపోనోయ్—ఒకరి దగ్గర చెయ్యి జాచి యెరగను. పొరుగువాడివీ, నాలుగు రాళ్లు తెచ్చుకుంటున్న వాడివీ అని నిన్ను యాచించాను.' అతను ప్రాధేయపట్టం చూస్తే మొహం మీద ఉమ్మెయ్యబుద్ధిపుట్టింది.

'నేను ధనం పోగుబోసుకు కూచో లేదు—దానకర్ణుణ్ణని బల్లా కట్టుకో లేదు. నాకేదో నాలుగురాళ్లు వస్తున్నాయి, డబ్బు మురగ వేస్తున్నానని నీకడుపుడుకుగాని- నాకు మటుక్కు ఖర్చులు లేవూ? ఏంచిటో! ఎంతచెట్టు కంత గాలి!!' పర్సు దాచేశాను.

మొహం ముడుచుకుని లేచిపోయాడు చెల్లయాచారి.

# నిజంగా ఆరోజు వస్తే—

చెరుకువాడ శ్రీరామమూర్తి

గంట కొట్టగానే, గబగబలాడుతూ కూలీలంతా పని కట్టేశారు. అంతకు ముందే వెళ్ళిపోయిన అధికారులు ఇంకా ఎక్కడైనా కబుర్లు చెప్పుకొంటూ కాలక్షేపం చేస్తున్నారేమోనని నలువైపులా కనిపించినంత దూరం పారచూచి బయలుదేరాను. అదే సమయాన్ని వ్యవసాయ కూలీలు పాటలు పాడుతూ, 'జానపదాల' ఉత్సాహాన్ని వినేవాళ్ళ మనస్సులోకూడా వ్యాపింపజేస్తూ, తొందర తొందరగా పాటలో లయ కలుపుతూ నడిచిపోతున్నారు. "అదేం పువ్వు-చెలోచెలో, పొలోపొలో- కలవ పువ్వు-" పదంలో "చెలోచెలో, పొలోపొలో" చలోక్తి (ఊతపదం!)- పాట చెప్పే పడుచుకు ఎదురుగుండా ఏమి కనిపిస్తే దానిమీదే పాడుతుంది.

నేను పాట వింటూ నడుస్తున్నానే కాని మనస్సులో పలురకాల ఆలోచనలు కదులుతున్నాయి. వాళ్లు ప్రొద్దంతా కష్టించి, కూలి సంపాదించిన ఆనందంతో కష్టాన్నే మరిచిపోయి గూటికి ఎగిరిపోతున్నారు. కానీ నేనలా కాదు- నెలరోజులు పనిచేసి జీతం పుచ్చుకోవాలి! జీత మందుకొని పదిరోజులే అయింది; చేతిలో కానీ కనపడ్డం లేదు. అంత కన్నా ముఖ్యం, రామపాదసాగరం పుణ్యాన్ని దొరికిన వుద్యోగం క్రితం వారంనుంచి ప్రాజెక్టు కట్టే విషయంలో ప్రభుత్వం జరుపుతున్న